సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



లోకక్షేమం కోసం అరుదెంచిన ఆరోగ్యమాత

మరియతల్లి దీవెనలు మానవాళిపై ఉండాలని కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గాలి బాలి అన్నారు. -IIలో



ఆకాశం నుంచి పాతాళానికి..

గుర్రంకొండ మార్కెట్‌లో టమాట ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో అత్యధికంగా రూ.6 వరకు మాత్రమే పలుకుతోంది. -IIలో

గరిష్టం/కనిష్టం
34.3/26.1

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 26.1 - 34.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

11 నుంచి తరగతులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం తరగతులు ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అకడమిక్ టైమింగ్స్ ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులకు హాజరుకావాలని సూచించారు.

నూతన నియామకం



వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ జనతా పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా వంగల శశిభూషణ్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి నియామక పత్రాన్ని జారీ చేశారు. సింహాద్రిపురం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన శశిభూషణ్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.

తిరుపతికి ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : హైదరాబాదు నుంచి తిరుపతికి కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని రైల్వే చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జనార్దన్ తెలిపారు. 07633/07644 నెంబరుగల రైలు ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు హైదరాబాదులో బయలుదేరి తెల్లవారుజామున 5.50 గంటలకు కడపకు చేరుకుని తిరుపతికి 10.00 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు ఈనెల 11, 18, 25 తేదీలతో పాటు అక్టోబరు 2న ఈ మార్గంలో నడుస్తుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 12, 19, 26, అక్టోబరు 3న తిరుపతి–హైదరాబాదు మధ్య నడుస్తుందన్నారు.

ఇంధన పొదుపు అవసరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు ఇంధన పొదుపు అవసరాన్ని గుర్తించాలని కడప డీపీటీఓ పొలిమేర గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో డ్రైవర్లకు నిర్వహించిన డ్రైవర్లకు అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆల్కహాల్ సేవించి విధులకు హాజరు కావద్దని, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. తక్కువ మైలేజీ తీసుకొచ్చే డ్రైవర్లకు పంచ సూత్రాలపై అవగాహన, భద్రతా సూక్తి గురించి వివరించారు. అనంతరం బస్సులో కొంత మంది డ్రైవర్లను తీసుకెళ్లి ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మీభాస్కర్, పులివెందుల డిపో మేనేజర్ రామకృష్ణ, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూరు గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు రోజులపాటు జరిగే ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. డీఆర్‌పీ లకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయుల బోధనా తీరును మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు, శిక్షణా కార్యక్రమాలకు ఎవ్వరూ కూడా గైర్హాజరు కాకూడదన్నారు, సమావేశం లో శిక్షణా కేంద్రం సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య,ఏ ఎం ఓ ధనలక్ష్మి, ఎం ఐ ఎస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ పి. లక్ష్మీ నరసింహ రాజు, ప్రకాశం జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, ఏఏఎంఓ రామాంజులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'యుద్ధప్రాతిపదికన అనుమతులు'



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు ఎస్. రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ సేవలకు సంబంధించిన అనుమతులు యుద్ధ ప్రాతిపదికన జారీ చేయాలని ఆ శాఖ పర్యవేక్షక ఇంజనీరు ఎస్.రమణ ఆదేశించారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన ఫైళ్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వివిధ రకాల రోజువారీ పనుల పురోగతిపై సమీక్షించారు. విద్యుత్ బకాయిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వసూలు చేయాలన్నారు. కార్యాలయంలో ఫైళ్లు పెండింగ్‌లో ఉంచవద్దని, ఈ–ఆఫీస్ పద్ధతి ద్వారా క్లియర్ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

సై అంటే సై

- కడప టీడీపీలో విబేధాలు బట్టబయలు
- కడప ఇన్‌చార్జిగా ఆర్ మాధవి
- నియామకపు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- భగ్గుమంటున్న కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబం



ఉమాదేవి, టీడీపీ కార్పొరేటర్

సాక్షి ప్రతినిధి, కడప: టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జిగా శుక్రవారం పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి సతీమణి ఆర్ మాధవి పేరు ఖరారు చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామకపు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా కేంద్రమైన కడప టీడీపీలో అంతర్గత విభేదాలు ఒక్కమారుగా బట్టబయలయ్యాయి. ఇన్‌చార్జిగా నియమిస్తారని ఎంతోకాలంగా ఆశలు పెట్టుకున్న కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబం భగ్గుమంటోంది. స్థానికులకు అవకాశం కల్పించమని కోరినా ఫలితం లేకపోవడమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. స్థానికుల సత్తా ఏమిటో స్థానికేతరులకు చూపించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.

కడప నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలుస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థి ఎస్‌బీ అంజద్‌బాషా ఘన విజయం సాధించారు. 1999 ఎన్నికల తర్వాత టీడీపీ కడప గడపలో వరుసగా ఓటమి చవిచూసింది. 2004 నుంచి కాంగ్రెస్, తర్వాత వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ విజయదుందుబి మోగిస్తోంది. మరోమారు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ అభ్యర్థిత్వంపై ఆ పార్టీ ఏకైక కార్పొరేటర్ జి ఉమాదేవి కుటుంబం ఆశలు పెంచుకుంది. ఆమేరకు టీడీపీ నుంచి సిగ్నల్స్ రావడంతో గ్రౌండ్ వర్క్‌పై గత కొంతకాలంగా పథక రచన చేపట్టారు. ఓటింగ్ ఎలా అనుకూలంగా పెంచుకోవాలనే దిశగా ముమ్మర యత్నాలు చేశారు. క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా మంతనాలు నిర్వహిస్తూ పలువురు క్రియాశీలక వ్యక్తుల మద్దతు కోరుతూ చాప కింద నీరులా ఉమాదేవి మామ ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి వ్యవహరిస్తూ వచ్చారు. అంతలోనే టీడీపీ ఇన్‌చార్జిగా ఆర్ మాధవిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఊహించని పరిణామంతో లక్ష్మీరెడ్డి కుటుంబం కినుక వహించింది. ఆయన మద్దతుదారులు ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో చూపించాలని బాహాటంగా ఆరోపణలు సంధిస్తున్నట్లు సమాచారం.



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాధవి

స్థానికతను పరిగణలోకి తీసుకోవాలని కోరినా...

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును పలుమారు కలిసి స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కడప టీడీపీ నేతలు అభ్యర్థించారు. స్థానికులను పరిగణలోకి తీసుకుని టికెట్ ఆశిస్తున్న అమీర్‌బాబు, జి ఉమాదేవి ఎవరికైనా టికెట్ కేటాయించాలని, మేమంతా కలిసికట్టుగా టీడీపీ విజయం కోసం కృషి చేస్తామని టీడీపీ నేత లక్ష్మీరెడ్డి చెప్పినట్లు సమాచారం. సామాజిక వర్గ సమీకరణ నేపథ్యంలో మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే అమీర్‌బాబును పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. బలిజలు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే దుర్గాప్రసాద్ లేదా హరిప్రసాద్‌లను పరిశీలించాలని, రెడ్డికి టికెట్ కేటాయించాల్సి వస్తే తమ కుటుంబాన్ని పరిగణలోకి తీసుకోవాలని లేదంటే గోవర్ధన్‌రెడ్డికి కట్టబెట్టినా తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని తేల్చి చెప్పినట్లు సమాచారం. అలా కాకుండా ఆర్ శ్రీనివాసులరెడ్డికి కట్టబెడితే పార్టీకి పనిచేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ టీడీపీ అధిష్టానం వాసు కుటుంబానికి ఇన్‌చార్జి బాధ్యతలను కట్టబెట్టింది. అధిష్టానం నిర్ణయంతో కడప గడపలోని తెలుగు తమ్ముళ్లు రగిలిపోతున్నారు.

వ్యూహాత్మక అడుగులు వేసిన వాసు...

కడపలో ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి కుటుంబాన్ని కట్టడి చేసేందుకు పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి వ్యూహాత్మక అడుగులు వేశారని రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించేందుకు కుప్పం వెళ్తూ కడప ఎయిర్‌పోర్టు నుంచి ఆలంఖాన్‌పల్లె మీదుగా కడపలోకి ప్రవేశించాల్సి ఉండగా, ఆ కార్యక్రమాన్ని తెరవెనుక మంత్రాంగం నిర్వహించి అడ్డుకున్నారు. రింగ్‌రోడ్డు వెంబడి దేవుని కడప, పెద్దదర్గా దర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తర్వాత చంద్రబాబు జోన్–6 ప్రాంతీయ సదస్సు నిర్వహణ కార్యక్రమం ఎయిర్‌పోర్టు సమీపంలో లక్ష్మీరెడ్డి స్థలంలో ఏర్పాటు చేయాలని భావించినా, ఆ కార్యక్రమాన్ని కూడా అడ్డుకున్నారు. లక్ష్మీరెడ్డి కుటుంబం టీడీపీలో ఫోకస్ కాకుండా వ్యూహాత్మకంగా శ్రీనివాసులరెడ్డి అడ్డుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈనేపథ్యంలో కడప తెలుగుతమ్ముళ్లు ఇన్‌చార్జి ఆర్ మాధవికి ఏమాత్రం సహకరిస్తారో వేచి చూడాల్సిందే.!

అభివృద్ధే ధ్యేయం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి
- ఎర్రగుంట్లలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం
- దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ



వైఎస్సార్ విగ్రహావిష్కరణలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డిలు ర్యాలీగా వచ్చారు.మొదట పశువైద్యశాలను ప్రారంభించారు.మార్కెట్ యార్డులో రూ.5 కోట్లతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణంలో డంపింగ్ యార్డు స్థల సేకరణకు ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ ఏర్పాటుకు రూ.1 కోటి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఈ పనులన్నింటిని రాబోయే ఆరు నెలల్లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలసి పూర్తి చేయిస్తామని తెలిపారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోయాయని అంటూ ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు.

ఎర్రగుంట్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల పట్టణాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు సహకరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గా, మంత్రిగా పని చేసిన ఆదినారాయణరెడ్డి ఇక్కడ ఒక్క అభివృద్ధి కూడా చేయలేదన్నారు. దేవగుడిలో కూర్చొని ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్నాని విమర్శించారు.

దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహావిష్కరణ

ఎర్రగుంట్ల మున్సిపల్ భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఎంపీ, ఎమ్మెల్యే, విగ్రహ దాత సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ ఈశ్వరప్రసాద్‌రెడ్డి తదితరులు

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

జిల్లా కలెక్టర్ విజయరామరాజు



కలెక్టర్ విజయరామరాజుకు సమస్యలను తెలియజేస్తున్న మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి

వేముల: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే జగనన్నకు చెబుదాం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో శుక్రవారం జేసీ గణేష్‌కుమార్, ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లాగంగాదేవి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణిలతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వీటిని సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని చెప్పారు.డీకేటీ భూములు మంజూరు చేయాలని వినతి పత్రాలు ఇవ్వగా మండల కేంద్రానికి 5కిలోమీటర్ల పరిధిలోపు డీకేటీ భూములు ఇచ్చేందుకు అవకాశం లేదని వివరించారు.ఎక్కడైనా రైతులు సాగుచేస్తున్నట్లయితే ఆ భూమి సాగుచేసుకోవచ్చని, హక్కుపత్రాలు ఇచ్చేందుకు వీలులేదన్నారు.యురేనియం ప్రాజెక్టుకు సంబంధించి నాలుగో విడతలో ప్రాజెక్టుకు భూములు యూసీఐఎల్ తీసుకోవడం లేదని పీసీబీ డైరెక్టర్ మరకశివకృష్ణారెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై ప్రాజెక్టు జీఎం ఎంఎస్.రావుతో ఆరా తీశారు.ట్రైనీ కలెక్టర్ భరద్వాజ, మండల పరిశీలకులు రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి,డ్వామాపీడీ యధుభూషణ్ రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, కోఆప్షన్ సభుడు మాపీరా,నాయకులు వెంకటనారాయణ, రాఘవరెడ్డి, వెంకటశివారెడ్డి, రాధాకృష్ణయ్య, గంగులయ్య, మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

కడప సెవెన్‌రోడ్స్/కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ పరిశీలన పక్కాగా చేపడుతున్నామని, తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ తమవంతుగా సహకరించాలని కలెక్టర్ విజయ్ రామరాజు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడారు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను రాష్ట్రంలోని సంప్రదాయ, చేతివృత్తిదారులంతా ఉపయోగించుకోవాలని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా అర్హులైన చేతి వృత్తిదారులకు ఆధునిక నైపుణాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి తగిన పనిముట్లను సరఫరా చేస్తారన్నారు.

మీ సహకారం మరువలేనిది

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి
- ఎస్పీకి ఘనంగా వీడ్కోలు



ఎస్పీని ర్యాలీగా జీపులో తీసుకెళుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్: కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నూతన పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వీక్షకుల గ్యాలరీని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. తరువాత పోలీసు అధికారులు సిబ్బంది ఆయనను ర్యాలీగా కడప పోలీస్‌పరేడ్ గ్రౌండ్ నుంచి క్యాంప్ కార్యాలయం వరకు ఊరేగింపుగా భుజాలపై ఎత్తుకుని తీసుకొచ్చారు. గజమాలను క్రేన్ ద్వారా తీసుకొచ్చివేశారు. అనంతరం కడపలోని 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలీస్ అధికారులు, మీడియా బృందం సహకారం మరువలేనిదనీ, కరోనా సమయంలో ఇంకా ఎంతో అనుబంధం పెరిగిందని ఎస్పీ తెలియజేశారు.

- జిల్లా పోలీసుశాఖ ప్రజలకు మరింత విస్తృత సేవలను అందించేందుకు వీలుగా రూపొందించిన 'వైఎస్‌ఆర్‌జిల్లాపోలీస్'అధికారిక వెబ్‌సైట్‌ను జిల్లా ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం ప్రారంభించారు.

ఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్: బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను మేయర్ కె. సురేష్ బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

హలో బ్రదర్.. హాయ్ సిస్టర్

SAKSHI WEEKEND

- నలుగురు వరాల బిడ్డలు
- 2012లో ఒకే కాన్పులో జననం
- లాలనలో తప్పని సమయపాలన



చిన్నప్పుడు నలుగురు పిల్లలతో సైపుల్లా, నఫీసా (ఫైల్)

బి.కొత్తకోట: వారు నలుగురు ఒకేసారి పుట్టారు. వీరిలో ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలు. వీరిలో ఒకరికి ఏడుపువస్తే మిగిలిన ముగ్గురికీ ఏడుపొస్తుంది.జ్వరమొచ్చినా, ఏ ఇబ్బంది కలిగినా అందరికీ ఒకేసారి అలాగే వస్తుంది. ఇది చదువుతుంటే 'హలో బ్రదర్స్' సినిమా గుర్తుకొస్తోంది కదూ. వీరిది అచ్చంగా అలాంటి కథే.. అయితే ఇది కథ కాదు.. జీవితవిచిత్రం. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలకేంద్రానికి చెందిన వీరి గురించి ప్రత్యేక కథనమిది.

ఒకే కాన్పులో..

బి.కొత్తకోటలో మొబైల్ షాపు నిర్వాహకుడు పి.సైపుల్లా దంపతులకు ఒకే కాన్పులో నలుగురు పిల్లలు జన్మించారు. తొలుత భార్య నఫీసా కడుపులో నలుగురు పిల్లలు ఉన్నారని డాక్టర్ చెప్పిన వార్తకు సైపుల్లాపై పిడుగుపడ్డట్టయ్యింది. 'యా అల్లా ఏమిటిది' అని కంగారు, ఆందోళన అన్నీ పడ్డాడు. చివరకు అల్లా నిర్ణయానికి కట్టుబడుదాం అని సముదాయించుకున్న సైపుల్లా ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు తండ్రి అయిపోయాడు. ఇప్పటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఒకబిడ్డను పెంచి పెద్దచేయడమంటే తల ప్రాణం తోకకు వచ్చినట్టే. ఏ ఇబ్బంది లేకుండా వారి ఆలనాపాలనా చూడాలంటే అబ్బ ఎంత కష్టమో తల్లిదండ్రులకు ఎరుకే. చిన్నపిల్లలు ఏదైనా కావాలని పట్టుపట్టినా, ఏడుపు మొదలెట్టినా ఇక అంతే. సముదాయించేందుకు ఇంట్లో ఎందరుంటే అందరూ..ఒకరి తర్వాత ఒకరుగా చేతుల్లోకి తీసుకుని లాలిస్తారు..ఆడిస్తారు.. అలాంటిది ఏకంగా ఒకేసారి పుట్టిన నలుగురు బిడ్డల ఆలనాపాలనా చూడాలంటే..తల్లి నఫీసా పడిన కష్టం అంతా ఇంతా కాదు. 2011లో ఒకే కాన్పులో పుట్టిన నలుగురు పిల్లలు ఇప్పుడు పెద్దవారయ్యారు. వీరంతా ఒకేసారి స్కూలుకు వెళ్తారు. ఒకే తరగతిలో కూర్చుంటారు. జన్మదినం ఒకేరోజు ఒకే సమయంలో జరుపుకుంటారు. అందుకే ఈ నలుగురు పిల్లలు అందరిలో ప్రత్యేకంగా నిలుస్తున్నారు.

స్కాన్‌కు అందక బెంగళూరుకు..

సైపుల్లా, నఫీసాలు స్థానిక ఖాజాఖాన్‌వీధిలో నివాసం ఉంటున్నారు. సైపుల్లా మొబైల్ దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. నఫీసాకు 2008లో తొలికాన్పు అయింది. అఫ్నాన్ అనే ఆడబిడ్డ పుట్టింది. 2011లో నఫీసా రెండోసారి గర్భందాల్చింది. మదనపల్లెలో వైద్యసేవలు అందిస్తుండగా ఒకరోజు డాక్టర్ స్కాన్ చేయగా అర్థంకాని పరిస్థితి ఎదురైంది. గర్భంలో ఉన్నది ఒకరా, ఇద్దరా అన్నది స్పష్టం కాలేదు. దీనిపై బెంగళూరు వెళ్లాల్సిందిగా వైద్యుల సూచన మేరకు నఫీసాను బెంగళూరులోని క్లౌడ్‌నైన్ ఆసుపత్రి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు నఫీసా గర్భంలో నలుగురు పిల్లలు వున్నట్టు నిర్ధారించగా ఈ మాట విన్న సైపుల్లా నమ్మలేక నమ్మాల్సి వచ్చింది.

ఒకరివెంట ఒకరుగా..

2011 అక్టోబర్, 22న నఫీసాకు జరిగిన సిజేరియన్ కాన్పులో నలుగురు జన్మించగా వారిలో తొలుత, చివరన మగపిల్లలు, మధ్యలో ఆడపిల్లలు పుట్టారు. తొలిగా మహమ్మద్ రెహాన్, తర్వాత వరుసగా..బుస్రా అంజుమ్, హానియా అంజుమ్, మహమ్మద్ షయాన్ జన్మించారు. వీరుపుట్టాక కొన్నిరోజులు క్లౌడ్‌నైన్ ఆసుపత్రి గైనిక్ లీలాభగవాన్, డైరెక్టర్ కిషోర్‌కుమార్‌లు ప్రత్యేక వైద్యసేవలు అందించారు. నెలరోజులు ఆస్పత్రిలో, నెలరోజులు బెంగళూరులోనే ఉండి బి.కొత్తకోటకు వచ్చారు. ఇంటిలో ప్రత్యేక ఏర్పాట్ల మధ్య పిల్లల పెంపకం జరిగింది.

ఒక్కొక్కరికీ ఒక్కో సమయం

చిన్నప్పుడు తల్లి, నాయనమ్మ వీరి ఆలనాపాలనా చూశారు.ఒక్కొక్కరికి ఒక్కో సమయాన్ని గుర్తుపెట్టుకుని పాలు తాగిస్తారు. ఉదయం 11దాకా నిద్రపోతారు. నిద్రలేచాక వారికి స్నానాలు చేయించేవారు.నిద్రపుచ్చేందుకు ఇంట్లో మూడు జోలెలు కట్టారు. వీరిని తల్లి నసిఫా, నానమ్మ హబీబ్‌జాన్ చూసుకుంటారు. పిల్లలకు ఏదైనా ఇబ్బంది కలిగితే చుట్టుపక్కల వారు వచ్చి సహకారం అందించేవారు.

స్కూలుకు సిద్ధం చేయడమే కష్టం

పిల్లల ఆలనాపాలనా విషయంలో తల్లిదండ్రులకు ఎక్కడా ఇబ్బంది అనిపించలేదు కాని..స్కూలుకు పంపేటప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుందని తల్లి నఫీసా అంటోంది. స్కూలు సమయానికి ఒకేసారి నలుగురు పిల్లలతోపాటు మొదట పుట్టిన పాపను సిద్ధం చేయాలి. పిల్లల విషయంలో కష్టంగా అనిపించేది ఇదొక్కటే. వారిని చూసుకోవడంలో ఎక్కడా విసుగు అనిపించదు.వారితో ఉండటమే ఆనందం అంటోంది నఫీసా.

ఒకే తరగతిలో కలిసి..



మహమ్మద్ రెహాన్,బుస్రా అంజుమ్, హానియా అంజుమ్, మహమ్మద్ షయాన్

ఈ నలుగురు పిల్లలది అన్నింటిల్లో స్పెషల్. ఇప్పుడు 12 ఏళ్ల వయసుతో పీపల్ ట్రీ స్కూలులో ఆరో తరగతి చదువుతున్నారు. తండ్రి సైపుల్లా రోజూ వీరిని స్కూలుకు తీసుకెళ్లడం, మళ్లీ ఇంటికి తీసుకురావడం దినచర్య. నలుగురు పిల్లలు ఒకే తరగతి గదిలో ఒకేచోట కూర్చుని చదువుకుంటారు. వీరంతా ఒకేసారి సమాన తరగతి కావడం వల్ల ఒకే సిలబస్‌ను కలిసి చదువుకునే అవకాశం కలిగింది.

ఒకేసారి బర్త్‌డే



పుట్టిన రోజు వేడుక జరుపుకుంటున్న నలుగురు పిల్లలు (ఫైల్)

నలుగురు పిల్లల బర్త్‌డే ఒకేసారి జరుపుకోవడం సైపుల్లా కుటుంబానికి ప్రత్యేకం. అక్టోబర్ 22న నలుగురికి నాలుగు కేకలను తెచ్చి ఒకేసారి జన్మదినం వేడుకలను జరపడం అదో సంబరం. ఆ రోజంతా పండగ వాతావరణమే. ఉదయం నుంచి రాత్రి వరకు ఇల్లు సందడిగానే ఉంటుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల రాకతో సందడి నెలకొంటుంది. ఒకేసారి నలుగురు కేక్ కట్ చేస్తుంటే చూడముచ్చటగా ఉంటుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తుంటారు.

ఇబ్బంది లేదు..

"పిల్లలను పెంచే విషయంలో ఏనాడు ఇబ్బందిగా భావించలేదు. మా అత్త, ఇరుగుపొరుగు వాళ్లు పిల్లలను ఎంతో ఆదరించారు. వారిని చూసుకునే విషయంలో సహకరించారు. ఒకేసారి నలుగురు పుట్టినప్పటికీ వారి బాగోగులు చూసుకోవడం దినచర్యగా మారింది. ఎవరికి ఏ సమయంలో ఏమి కావాలో అర్థం చేసుకుని అందిస్తుంటాను. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకొంటూ వస్తున్నాం.

-నఫీసా, సైపుల్లా

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం

రాయచోటి టౌన్‌ : విధులు నిర్వర్తిస్తూ గుండె పోటుతో మృతి చెందిన పోలీస్‌ జె.సుబ్బరాయుడు (పీసీ నంబర్‌ 2075) కుటుంబానికి జిల్లా ఎస్పీ గంగాధర్‌ రావు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ మొత్తంతోపాటు పోలీసుల వితరణ ద్వారా వచ్చిన మరో రూ.2 లక్షలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏవో కృష్ణుడు, జూనియర్‌ అసిస్టెంట్‌ కిరణ్‌ పాల్గొన్నారు.

ఘనంగా దర్గా మాతాజీ ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ పరిధి శ్రీ సద్గురు సాయి నగర్‌లో వెలసిన శ్రీ సద్గురు దర్గా మాతాజీ 19వ నవదశ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సమర్థ సద్గురు దర్గా మాతాజీ సమాధి మందిరం వద్ద ప్రార్థనలు, గురుపూజ, నవగ్రహ పూజ, రక్ష బంధన, కలశం, రుద్రాభిషేకం భక్తులు అందరి చేత జరిపించారు. అనంతరం మంగళహారతి, తీర్థ ప్రసాదాలతో ముగించారు. సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ పూజ నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

కేవీపల్లె : హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ పీలేరు సీనియర్‌ సివిల్‌ జడ్జి శ్రీనివాసులు నాయక్‌ తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ లోకేష్‌ తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని బండవడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు 2020 ఏప్రిల్‌ 4న డబ్బుల విషయమై అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్‌పై కత్తితో దాడి చేశాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి నిందితుడు శ్రీనివాసులకు ఏడాది జైలుశిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆకాశం నుంచి పాతాళానికి..!

- భారీగా పతనమైన టమాట ధరలు
- మార్కెట్లో కిలో రూ.6
- 15 రోజుల్లో 75 శాతానికి పైగా తగ్గిన వైనం
- పెరిగిన పంట దిగుబడే కారణం



మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ : మార్కెట్‌లో టమాట ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో అత్యధికంగా రూ.6 వరకు మాత్రమే పలుకుతోంది. 15 రోజుల క్రితం రూ.20 నుంచి రూ.25 వరకు ఉన్నాయి. ప్రస్తుతం 75 శాతానికి పైగా ధరలు తగ్గిపోయాయి. జిల్లాతోపాటు బయటి ప్రాంతాల్లో పంట దిగుబడి భారీగా పెరగడమే ఇందుకు కారణమని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దీంతో రోజురోజుకు ధరలు పతనమైపోతున్నాయి.

మార్కెట్‌కు భారీగా వస్తున్న స్టాక్‌

మార్కెట్‌లో 15 రోజుల కిందట 25 కేజీల క్రేట్‌ రూ.500 నుంచి రూ.625 వరకు పలికింది. అయితే వారం రోజులుగా ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం 25 కేజీల క్రేట్‌ రూ.150 వరకు మాత్రమే పలుకుతోంది. ప్రస్తుతం మొదటి రకం కిలో రూ.6, రెండో రకం కిలో రూ.5, మూడో రకం రూ.3 వరకు పలుకుతున్నాయి. 15 రోజుల కిందట జిల్లాలోని అన్ని టమాట మార్కెట్‌ మండీలకు ప్రతి రోజు 340 నుంచి 368 టన్నుల స్టాకు వచ్చేది. ప్రస్తుతం రోజూ 3250 నంచి 3465 టన్నుల వరకు వస్తోంది. దీనికి తోడు రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, అనంతరపుం, వైఎస్సార్‌ జిల్లాలతోపాటు బయట రాష్ట్రాల్లో దిగుబడులు పుష్కలంగా ఉన్నాయి. రెండు నెలల్లోనే కిలో రూ. 200 నుంచి రూ.6కు పడిపోయింది. రోజుల వ్యవధిలోనే ఆకాశం నుంచి పాతాళానికి పడిపోవడంతో.. రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే టమాటాలను మార్కెట్‌కు తీసుకొచ్చే కూలీలు, రవాణా ఖర్చులకు కుడా సరిపోవని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 3 రోజులుగా పలువురు రైతులు టమాటలను మండీలకు తీసుకొచ్చి.. తీరా వేలం పాటల్లో వచ్చిన ధరలు చూస్తే కూలీలకు చేతి నుంచి డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు.

దిగుబడి పెరగడంతో తగ్గిన ధరలు



మన జిల్లాతో పాటు బయటి ప్రాంతాల్లో టమాట పంట దిగుబడులు భారీగా పెరిగాయి. దీంతో రోజురోజుకు ధరలు తగ్గిపోతున్నాయి. 15 రోజుల కిందట వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 340 టన్నుల స్టాకు అన్ని మార్కెట్లకు కలిపి వచ్చేది. ప్రస్తుతం రోజూ సగటున 3450 టన్నులకు పైగా వస్తోంది. దీంతో 15 రోజుల ధరలతో పోల్చితే ప్రస్తుతం 75 శాతానికి పైగా తగ్గిపోయాయి.

– జగదీష్‌, మార్కెట్‌ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

• పశువులకు మేతగా..



ములకలచెరువు : నెల రోజుల క్రితం టమాట ధరలు ఆకాశాన్నంటాయి. కిలో రూ.200లు, రూ.300ల వరకు ధర పలికింది. ఇప్పుడేమో 30 కిలోల బాక్సు ధరలు చూస్తే కనీసం ఇటు కూలీ, అటు రవాణా ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు టమాటలను రోడ్డు పక్కన పారబోసి పశువులకు మేతగా వేస్తున్నారు. ఈ ఘటన ములకలచెరువు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



వెంకటేశ్‌ మృతదేహం

చెన్నూరు : మండలంలోని దౌలతాపురం ఎస్టీ కాలనీకి చెందిన ఇండ్ల వెంకటేష్‌ (25) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శుక్రవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరిలోని సోమలరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఇండ్ల వెంకటేష్‌కు చెన్నూరు మండలం దౌలతాపురం గ్రామంలోని ఎస్టీ రామాపురానికి చెందిన మల్లీశ్వరితో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తలు దౌలతాపురం ఎస్టీ కాలనీలో ఉంటూ కడపలోని ఒక కల్యాణ మండపంలో స్వీపర్లుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేష్‌ రెండు రోజుల నుంచి ఆరోగ్యం సరిగా లేదని గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయి ఎస్టీ కాలనీ సమీపంలోని కంప చెట్లలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా కుటుంబ కలహాలతోనే వెంకటేశ్‌ మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

లోకక్షేమం కోసం అరుదించిన ఆరోగ్యమాత

ఘనంగా ముగిసిన జయంతి వేడుకలు





దైవ సందేశం అందజేస్తున్న బిషప్‌ గాలి బాలి, ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

కడప కల్చరల్‌ : ప్రపంచమంతా మరియతల్లి గురించి తెలియని వారుండరని, ఆమె దీవెనలు ఈ జయంతి సందర్భంగా మానవాళిపై సంవృద్ధిగా వర్షించాలని కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్‌ రెవ డాక్టర్‌ బిషప్‌ గాలి బాలి అన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మరియతల్లి జన్మదిన వేడుకల ప్రత్యేక దివ్యబలి పూజను జిల్లాలోని గురువులతో కలిసి సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ మరియతల్లి తన బిడ్డల అవసరాలను గుర్తెరిగి, వారు కోరక ముందే సహాయం అందిస్తారని, దీవెనలతో రక్షిస్తారని తెలిపారు. ఆమె మహిమలను మరింత పదిలం చేసేందుకు క్రీస్తు ప్రభువు.. మానవులందరి తల్లిగా భావించి యోహానుకు అప్పగించారని, నాటి నుంచి మరియ మనతో మన కుటుంబాలలో కొలువై ఉన్నారని తెలిపారు. పేదలకు దానం చేయడం దైవానికి కానుకలు అర్పించినట్లేనని, ప్రతిఫలంగా మనకు దేవుడు మేలు చేస్తాడని తెలిపారు. ప్రార్థనలకు ముందు బిషప్‌ను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో మంగళ వాయిద్యాలతో గురువులు, చర్చి పెద్దలు ప్రార్థన స్థలానికి ఆహ్వానించారు. ప్రార్థనలనంతరం బిషప్‌ను శాలువా పూలమాల శాంతి సేవా సొసైటీ జ్ఞాపిక, అరుళయ్య కరుణయ్య పుస్తకంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెవ ఫాదర్‌ సంబటూరు సురేష్‌ రచించిన పూజా సమయం పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. రెవ ఫాదర్‌ బాకీ రవీంద్ర పర్యవేక్షణలో స్తుతి గీతాల ఆలాపన జరిగింది. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణంలోనూ, వెలుపల తిరునాల సందడిగా కనిపించింది. దుకాణాలు రద్దీగా మారాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రైస్తవ పాటలతో చెక్కభజనలు నిర్వహించారు. అనంతరం మరియ తల్లి పతాకాన్ని అవరోహణ చేసి కార్యక్రమాలకు ముగింపు పలికారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్‌ ఎండీ ప్రసాద్‌ రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మేత్రాసన కోశాధికారి ఫాదర్‌ పెండ్లికట్ల దేవదాస్‌, మల్టీ పర్పస్‌ సోషల్‌ సర్వీస్‌ సొసైటీ డైరెక్టర్‌ ఫాదర్‌ బాలరాజు, పుణ్యక్షేత్ర సహాయ డైరెక్టర్‌ ఫాదర్‌ విల్సన్‌, ప్రొద్దుటూరు డీన్‌ గురువులు విజయబాబు, జిల్లా నుంచి వివిధ సంస్థల గురువులు, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్‌, తిరునాల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు గండిలో ఆఖరి శ్రావణ శనివారోత్సవం

- వీరాంజనేయస్వామికి విశేష పూజలు
- లక్ష వరకు భక్తులు రావచ్చని అంచనా
- అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు



గండిలో కొలువుదీరిన వీరాంజనేయస్వామి

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండిలో శ్రావణ మాసం నాలుగో శనివారోత్సవం ఘనంగా జరగనుంది. ఏటా లాగే ఈసారి కూడా చివరి శనివారం భక్తుల సంఖ్య లక్షకు చేరువలో ఉంటుందని ఆలయ వర్గాలతోపాటు పోలీసులు అంచనా వేస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ సహాయ కమిషనర్‌ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్‌ రాఘవేంద్ర ప్రసాద్‌, పాలకమండలి సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవ మూర్తులకు అభిషేకం(ఏకాంతంగా) అలంకరణ, ఆరాధన, మహామంగళహారతి, సర్వదర్శనం కార్యక్రమాలు ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్‌, రాజ గోపాలాచార్యులు, వేద పారాయణం రామమోహనశర్మల ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు. భక్తుల కాలక్షేపం నిమిత్తం తోలుబొమ్మలాట, కూచిపూడి నృత్యం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నట్లు వారు పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతలచే పెద్ద ఎత్తున అన్నదానం, నీటి వసతి కల్పించనున్నట్లు వివరించారు.

వైభవంగా గ్రామోత్సవం ఆస్థానం

శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా సాయంత్రం పెద్ద ఎత్తున గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని తమిళనాడులోని అంబూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అందంగా అలంకరించిన ప్రత్యేక పల్లకీలో ఉష్ట్ర(ఒంటె) వాహనంపై అధిష్టింపజేసి, ఊరేగింపు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే కేరళ వాయిద్యాలు, కోలాటం భక్తులను ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు. అనంతరం పాపాఘ్ని నదిలో జరిగే ఆస్థానంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

కట్టుదిట్టంగా భద్రత

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆర్కేవ్యాలీ సీఐ గోవింద రెడ్డి తెలిపారు. సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసులు, మహిళా పోలీసులు, హోంగార్డులతో కలిపి సుమారు 220 మందితో బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. వీరు కాకుండా ట్రిపుల్‌ ఐటీ విద్యార్థులు స్వామి వారి సేవలో పాల్గొంటారని తెలిపారు. వాహనాలను గండిలోకి అనుమతించబోమని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్కే వ్యాలీ ఎస్సై రంగారావు పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

పెద్దముడియం : మండల పరిధిలోని కొండపాపాయపల్లె గ్రామంలోని రామసుబ్బమ్మ(38) ఆమె కూతరు సంధ్యారాణి(20) విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామసుబ్బమ్మ భర్త రంగారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నేళ్ల నుంచి పంటలు సరిగా పండకపోవడంతో రూ.25 లక్షల మేర అప్పు చేశాడు. అప్పు తీర్చలేక ఐపీ నోటీసులు పంపాడు. శుక్రవారం ఉదయం రుణదాతలు రంగారెడ్డి ఇంటి దగ్గరకు వెళ్లి అప్పులు కట్టాలని గట్టిగా అడగడంతో మనస్తాపానికి గురైన రామసుబ్బమ్మ, సంధ్యారాణి విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించారు. వారిని బంధువులు జమ్మలమడుగు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి దుర్మరణం



మృతి చెందిన రామకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి (ఫైల్‌)

బద్వేలు అర్బన్‌ : పట్టణంలోని భాకరాపేట క్రాస్‌ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్లూరు మండలం కామసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచనూరు రామకృష్ణారెడ్డి (63) దుర్మరణం చెందాడు. వ్యవసాయం, కాంట్రాక్టు పనులు చేసుకుంటూ ఆయన జీవనం సాగించే వాడు. ఓ పని నిమిత్తం బైక్‌పై బద్వేలుకు వచ్చి తిరిగి వెళ్తుండగా.. భాకరాపేట క్రాస్‌ వద్ద సిద్దవటం రోడ్డు వైపు నల్లరాతి బండలతో వెళుతున్న ట్రాక్టర్‌ వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అర్బన్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు వెంకటశేషారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్‌ హెడ్‌కానిస్టేబుల్‌ రాజు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అట్లూరు మండలం కామసముద్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కీలకనేతగా ఉన్న రామకృష్ణారెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అట్లూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించారు.

పాము కాటుతో మహిళ మృతి



పద్మావతి(ఫైల్‌)

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం పాము కాటుతో తుమ్మలూరు పద్మావతి(45) అనే మహిళ మృతి చెందింది. పద్మావతి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొలం వద్దకు వెళ్లిన వెంకటసుబ్బారెడ్డి భార్య పశుగ్రాసం కోసుకుంటుండగా పాము కాటుకు గురైంది. దీంతో సమీపంలోని అనంతపురం వద్ద గల యానాదుల వద్దకు చికిత్స నిమిత్తం తీసుకురాగా వారు తమ చేతకాదని చెప్పడంతో.. అక్కడి నుంచి ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలికి సిద్ధార్థరెడ్డి, సుదర్శన్‌రెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు చాపాడు పోలీసులు తెలిపారు.

అత్త కుటుంబంపై అల్లుడి దాడి



గాయపడిన చాంద్‌బీ, జాఫర్‌వలీ

మదనపల్లె : కుమార్తెపై వేధింపులు ఆపాలంటూ ప్రశ్నించడంతో.. అత్త కుటుంబంపై అల్లుడి కుటుంబ సభ్యులు దాడి చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామర్రిపల్లె పంచాయతీ బాలాజీనగర్‌కు చెందిన చాంద్‌బీ(47) తన కుమార్తె గౌసియాను స్థానికంగా నివాసం ఉన్న దావూద్‌కు ఇచ్చి పెళ్లి చేసింది. వారికి ముగ్గురు సంతానం కలిగారు. దావూద్‌ డ్రైవర్‌గా పని చేస్తూ ఎక్కువ కాలం విదేశాల్లోనే ఉండేవాడు. ఇటీవల స్వదేశానికి వచ్చిన ఆయన తిరిగి విదేశానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అల్లుడిని విదేశానికి వెళ్లకుండా స్థానికంగా ఉంటూ భార్యాపిల్లలను చూసుకోవాలని చెప్పేందుకు.. అత్త చాంద్‌బీ, తన కుమారులు జాఫర్‌వలీ(29), చాంద్‌బాషా(26)లతో కలిసి దావూద్‌ ఇంటికి వెళ్లింది. అత్త మాటలను వినిపించుకోని అల్లుడు దావూద్‌ తనకు రూ.2 లక్షల నగదు, బుల్లెట్‌ బండి, ఐదుతులాల బంగారం ఇస్తే వెళ్లకుండా ఇక్కడే ఉంటానంటూ అదనపు కట్నం డిమాండ్‌ చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దావూద్‌ అన్న మౌలాసాహెబ్‌ కత్తి తీసుకుని అత్త చాంద్‌బీ, ఆమె కుమారులు జాఫర్‌వలీ, చాంద్‌బాషాలపై దాడి చేశాడు. దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘర్షణలో దావూద్‌ తల్లి తాహీరున్నీసా స్వల్పంగా గాయపడింది. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధ్వంసమే చంద్రబాబు, లోకేష్‌ లక్ష్యం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : అల్లర్లు సృష్టించి లబ్ధి పొందేందుకే రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు, ఆయన కుమారుడు లోకేష్‌ పర్యటిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలను వారు ఎక్కడా సభల్లో ప్రస్తావించడం లేదని, ముఖ్యమంత్రి జగన్‌పై అక్కసుతో మాట్లాడుతున్నారన్నారు. ఏ ఊరికి వెళ్లినా సీఎం జగన్‌ను, స్థానిక ఎమ్మెల్యేలను తిట్టడం పనిగా పెట్టుకున్నారన్నారు. తన కార్యకర్తల చేత రాళ్లు, కర్రలతో దాడులు చేయించి విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. ఈ అల్లర్లలో తమ కార్యకర్తలు చనిపోతే దానిని రాజకీయం చేసి లబ్ధి పొందేందుకు బాబు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. పోలీసులు ఎంతో సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. రెండు ఎకరాల యజమాని అయిన చంద్రబాబు వేల కోట్ల రూపాయలు సంపాదించి గాంధీ వారసుల్లా మాట్లాడుతున్నారన్నారు. అమరావతి పేరుతో సింగపూర్‌, అమెరికా దేశాల్లో పర్యటించి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈటీవీ, టీవీ 5, ఏబీఎన్‌తోపాటు దత్తపుత్రుడైన పవన్‌ కల్యాణ్‌ చంద్రబాబుకు నాలుగు పిల్లర్లుగా ఉన్నారని అన్నారు. చరమ దశలో ఉన్న ఆయన చేసిన పాపాలకు మూల్యం చెల్లించక తప్పదని, ఇప్పటికైనా చట్టబద్ధంగా, న్యాయ బద్ధంగా వ్యవహరించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తు ఉండదన్నారు. సమావేశంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'తేలుకుట్టిన దొంగల్లా..'

కడప కార్పొరేషన్‌ : ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులతో ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌, వారి చుట్టూ ఉన్న నలభై మంది తేలు కుట్టిన దొంగల్లా నోరు మెదపడం లేదని ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

అంబకపల్లెలో వ్యక్తి దారుణ హత్య

9 మందిపై కేసు నమోదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌) నాగరాజు (ఫైల్‌)

లింగాల : లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో గురువారం ఉదయం 9, 10 గంటల మధ్య నాగరాజు (40) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నాగరాజు ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆయన పొలంలోకి వెళ్లాడు. అప్పటికే కాపుగాచిన కొంత మంది వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి చేసి హతమార్చారు. నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వివాహేతర సంబంధం లేక మరేదైనా కారణంతో ఆయనను చంపేసి ఉంటారని ఎస్సై రవికుమార్‌ తెలిపారు. జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, పులివెందుల అర్బన్‌ సీఐ రాజు, అర్బన్‌ ఎస్సైలు రవికుమార్‌, సత్యనారాయణ, ట్రాఫిక్‌ ఎస్సై హాజీవలి, తొండూరు ఎస్సై హనుమంతు, లింగాల ఎస్సై రవికుమార్‌, పులివెందుల రైటర్‌ స్వామి, లింగాల రైటర్‌ నూరుబాషాలు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేశవ మరో 8 మందిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహింపజేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో మరో నలుగురి అరెస్ట్‌

పీలేరు రూరల్‌ : ఆటో డ్రైవర్‌ సుధాకర్‌ హత్య కేసులో మరో నలుగురిని అరెస్ట్‌ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణం కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాల వద్ద గత నెల 31న ఇందిరమ్మ కాలనీకి చెందిన సుధాకర్‌ను విషంతో కూడిన సూదులతో గుచ్చి హత్య చేసిన కేసులో ఇది వరకే ఆరుగురిని అరెస్ట్‌ చేయడం విదితమే. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో నలుగురి నిందితులను శుక్రవారం తిరుపతిలో అరెస్ట్‌ చేసినట్లు సీఐ వివరించారు. శుక్రవారం అరెస్ట్‌ అయిన వారిలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం గోవిందపురానికి చెందిన తమ్మినేని రవికుమార్‌ (41), తిరుపతి టౌన్‌ ప్రకాషం రోడ్డులో నివాసం ఉంటున్న కారుపర్తి భానుచందర్‌ (32), కృష్ణా జిల్లా బాపులపాడు హనుమాన్‌ జంక్షన్‌కు చెందిన షేక్‌ మహ్మద్‌ హనీఫ్‌ (39), గుంటూరు జిల్లా మంగళగిరి తిప్పలబజార్‌కు చెందిన షేక్‌ సలీమ్‌ (60) ఉన్నారు.

చిరుధాన్యలక్ష్మికళ


రైమతి ఘురియా
సుబాసా మోహన్తా

కలెక్టర్ పిల్లలు కలెక్టర్, హీరో పిల్లలు హీరో, రాజకీయ నాయకుడు పిల్లలు రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటే, ఇక మధ్యతరగతి తల్లిదండ్రులు... తమలా తమ పిల్లలు ఇబ్బందులు పడకూడదని, తిని, తినక ఒక్కోరూపాయి పోగుచేసి, కష్టపడి చదివించి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారు. పంటలు పండించి అందరి ఆకలి తీర్చే రైతన్నలు మాత్రం తమ పిల్లలు తమలా రైతులు కావాలని అస్సలు కోరుకోవడం లేదు. ''పెద్దయ్యాక రైతును అవుతాను'' అని కూడా ఎవరూ చెప్పరు. ''మేము వ్యవసాయం చేస్తాం, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాం. ఇప్పుడు ప్రపంచ దేశాధ్యక్షులు సైతం మేము చెప్పబోయేది ఆసక్తిగా వినబోతున్నారు అదీ వ్యవసాయం గొప్పతనం'' అని చాటిచెబుతున్నారు ఇద్దరు మహిళా రైతులు.

అవును గొప్పగొప్ప చదువులు చదివినవారి కంటే..తమ పూర్వీకుల నాటి నుంచి ఆచరిస్తోన్న పద్ధతులలతో వ్యవసాయం చేస్తూ అందరి దృష్టి తమవైపు తిప్పుకున్న రైతులకు జీ–20 సదస్సుకు ఆహ్వానాలు అందాయి. పెద్దపెద్ద డిగ్రీలు, హోదాలు లేకపోయినప్పటికీ.. కేవలం వ్యవసాయం చేస్తున్నారన్న ఒక్క కారణంతో ... ప్రపంచ దేశాధ్యక్షులు పాల్గొనే 'జీ–20 సమితి'లో పాల్గొనే అవకాశం ఇద్దరు మహిళా రైతులకు దక్కింది. ఒడిశాకు చెందిన గిరిజన మహిళా రైతులు 'రైమతి ఘురియా, సుబాసా మోహన్తా'లకు ఈ అరుదైన గౌరవం లభించింది. సంప్రదాయ, గిరిజన చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు పద్ధతులను జీ–20 వేదికపై ఈ ఇద్దరు ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

> జీ20 సదస్సుకు హాజరవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చిరుధాన్యాల సాగు, ఈ ధాన్యాల ప్రాముఖ్యత గురించి అందరికీ చెబుతాను. గిరిజన మహిళగా గిరిజన సాగు పద్ధతులను మరింత విపులంగా అందరికీ పరిచయం చేస్తాను.
> **- రైమతి ఘురియా**

కోరాపుట్ జిల్లాలోని నౌగుడా గ్రామానికి చెందిన రైతే 36 ఏళ్ల రైమతి ఘురియా. భూమియా జాతికి చెందిన రైమతికి ముగ్గురు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తోంది. ఏళ్లపాటు వరిధాన్యాలు పండించే రైమతి... చిరుధాన్యాల సాగు మెళుకువలు నేర్చుకుని మిల్లెట్స్ సాగు మొదలు పెట్టింది. అధునాతన సాంకేతికతను జోడించి పంటలో అధిక దిగుబడిని సాధిస్తోంది. సాగులోలేని 72 దేశీయ వరి రకాలు, ఆరు చిరుధాన్యాలతో కలిపి మొత్తం 124 రకాల ధాన్యాలను అంతరించిపోకుండా కాపాడుతోంది. మంచి దిగుబడితో సాధిస్తున్న రైతుగానే గాక, తోటి గిరిజన రైతులకు చిరుధాన్యాల సాగులో సాయం చేస్తూ వారికీ జీవనోపాధి కల్పిస్తోంది. సంప్రదాయ పంటలైన వరి, మిల్లెట్ రకాలను పండిస్తూనే తన గిరిజన మహిళలెందరికో ఆదర్శంగా నిలుస్తూ... మిల్లెట్ సాగును ప్రోత్సహిస్తోంది. పంటమార్పిడి, అంతర పంటలు, సేంద్రియ పంటల్లో తెగులు నివారణ మెళకువల గురించి, స్కూలును ఏర్పాటు చేసి ఏకంగా 2500 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది. చిరుధాన్యాల సాగులో రైమతి చేసిన కృషికిగా గుర్తింపుగా అనేక ప్రశంసలు కూడా అందుకుంది. 2012లో జీనోమ్ సేవియర్ కమ్యునిటీ అవార్డు, 2015లో జమ్షెడ్జీ టాటా నేషనల్ వర్చువల్ అకాడమీ ఫెలోషిప్ అవార్డు, టాటా స్టీల్ నుంచి 'బెస్ట్ ఫార్మర్' అవార్డులే గాక, ఇతర అవార్డులు అందుకుంది.

చిరుధాన్యాల సాగులో అనుసరిస్తోన్న పద్ధతులు, దిగుబడి, తోటి రైతులను ఆదుకునే విధానమే రైమతిని జీ20 సదస్సుకు వెళ్లేలా చేసింది. ఈ సదస్సులో ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల చిరుధాన్యాలు, ఈ ధాన్యాలతో చేసిన విభిన్న వంటకాలు, చిరుధాన్యాలతో వేసిన ముగ్గులను ప్రదర్శించనుంది. చిరుధాన్యాల సాగులో తాను ఎదుర్కొన్న పరిస్థితులు, అధిక దిగుబడి కోసం అవలంబిస్తోన్న విధానాలు వివరించనుంది. మిల్లెట్ సాగులో అనుసరించాల్సిన అధునాతన సాంకేతికత, దాని ఉపయోగాల గురించి ఎమ్ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ సెంటర్ ఇచ్చిన శిక్షణ సంబంధిత అంశాలను ప్రస్తావించనుంది.

> చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిచేస్తాయి. ఇవి అనేక రకాల వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఒకప్పుడు గిరిజనుల ప్రధాన ఆహారం చిరుధాన్యాలు. కానీ ఇప్పుడు పొలాల నుంచి దాదాపు కనుమరుగయ్యాయి. నేను ధాన్యాలు పండించడం మొదలు పెట్టిన తరువాత నన్ను చూసి చాలామంది రైతులు చిరుధాన్యాలు సాగుచేయడం ప్రారంభించారు. ఇతర రైతులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాను. వరికంటే చిరుధాన్యాల సాగులో అధిక దిగుబడులు వస్తుండడంతో అంతా ఈ సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
> **- సుబాసా మోహన్తా**

సుబాసా మొహన్తా

మయూర్‌భంజ్ జిల్లాలోని గోలి గ్రామానికి చెందిన చిరుధాన్యాల రైతే 45 ఏళ్ల సుబాసా మొహన్తా. తన జిల్లాలో ఎవరికీ చిరుధాన్యాల సాగుపై ఆసక్తి ఏమాత్రం లేదు. 2018లో ఒడిశా ప్రభుత్వం రైతులను చిరుధాన్యాల సాగు చేయమని మిల్లెట్ మిషన్‌ను తీసుకొచ్చింది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితుల్లో ధైర్యం చేసి ముందుకొచ్చింది సుబాసా. ఏళ్లనాటి గిరిజన సాగుపద్ధతులను ఉపయోగిస్తూ రాగుల సాగును ప్రారంభించింది. అప్పటి నుంచి మిల్లెట్స్‌ను పండిస్తూ అధిక దిగుబడిని సాధిస్తోంది. ఇది చూసిన ఇతర రైతులు సైతం సుబాసాను సాయమడగడంతో వారికి సాగు పద్ధతులు, మెళకువలు నేర్పిస్తూ మిల్లెట్ సాగును విస్తరిస్తోంది. సుబాసాను ఎంతో మంది గిరిజన మహిళలు ఆదర్శంగా తీసుకుని చిరుధాన్యాలు సాగుచేయడం విశేషం. సుబాసా కృషిని గుర్తించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవార్డులతో సత్కరించాయి.

మహిళా సాధికారతకు మార్గదర్శనం


గ్రామీణ మహిళలతో షెఫాలికా

పెద్ద ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కన్న షెఫాలికా పండా ఆ కలకు దూరమై పేదలకు దగ్గరైంది. మహాపట్టణం నుంచి మారుమూల పల్లె వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది. తమ ఫౌండేషన్ తరఫున ఎంతోమందికి అండగా నిలబడింది. కష్టాలు, సమస్యల్లో ఉన్నవారికి సహాయం చేయడమే కాకుండా స్త్రీ సాధికారతకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. 'జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటార్‌షిప్' కన్వీనర్‌గా స్త్రీ సాధికారతకు సంబంధించి విస్తృత స్థాయిలో పనిచేసే అవకాశం షెఫాలికా పండాకు లభించింది...

కాలేజీ రోజుల్లో 'సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలని కలలు కనేది షెఫాలికా. అయితే ఒకానొక సంఘటనతో ఆమె కలల దారి మారింది. తమ బంధువు ఒకరు అనారోగ్యం పాలుకావడంతో, ఒడిషాలో సరియైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఢిల్లీకి తీసుకుపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి అసౌకర్యాల వరకు ఎన్నో సంఘటనలను దగ్గరగా చూసింది షెఫాలికా పండా.

'చదువుకున్న వారు, ఆర్థికంగా కాస్త మెరుగైన స్థితిలో ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే ఒడిశాలోని మారుమూల ప్రాంతాలలో ఉండే పేద ప్రజల పరిస్థితి ఏమిటి?' అని ఆలోచించింది. ఆ ఆలోచనల ఫలితంగా సేవారంగంలోకి వచ్చిన షెఫాలికా ఎంతోమంది పేదలకు అండగా నిలబడింది.

బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లింది.

'నాయకుల ఎదుగుదలకు సంబంధించి అనుభవం అనేది కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఎంత అనుభవం ఉంటే అంత బలం సమకూరుతుంది. సామాజిక సేవా రంగంలో పదహారు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. సమాజంలో సానుకూల మార్పు తేవాలనుకునేవారికి సమస్యను అర్థం చేసుకోవడంతో పాటు దానిపై పని చేయడానికి చాలా ఓపిక కావాలి. సామాజిక సేవలో మా అత్తమ్మ 'ఇలా పండా' నాకు ఆదర్శం. ఎలాంటి ఆడంబరం లేకుండానే ఎన్నో సంవత్సరాలు సేవ చేసింది. ఎండనకా, వాననకా తిరిగినా ఆమె ముఖంలో ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. సామాజిక సేవ తన ఆరోగ్య రహస్యంగా చెప్పుకునేది. ఆమె చురుకుదనం, సామాజిక సేవాదృక్పథాన్ని చూసి ఎంతో మంది స్ఫూర్తి పొందారు. అందులో నేను ఒకరిని' అంటుంది షెఫాలికా.

'అవసరం ఉన్న చోట మేముంటాం' అనే నినాదంతో బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ట్రస్టీ, సీయివోగా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టింది.

'మహిళలపై ప్రధానంగా దృష్టి పెట్టడానికి కారణం అసమానత, లింగ వివక్షత. మహిళల జీవితాలు మారాలంటే ఆమె పిల్లల జీవితాల్లో కూడా మార్పు రావాలని బలంగా నమ్ముతాను' అంటుంది షెఫాలికా.



> అవకాశాలు దొరికేవారు, దొరకని వారు అని మహిళలకు సంబంధించి రెండు రకాల వర్గీకరణలున్నాయి. అవకాశాలు దొరికేవారు సులభంగానే విజయం సాధించి పెద్ద స్థాయికి చేరుకుంటారు. మరి దొరకని వారి పరిస్థితి ఏమిటి? సాంకేతిక, జీవన నైపుణ్యాలు, చదువు రూపంలో అలాంటి వారిని వెలుగులోకి తీసుకువచ్చి విజయపథంలోకి తీసుకువెళ్లడంపై, మహిళలకు సమాన అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై జీ20 సదస్సు దృష్టి పెడుతుంది. జీ20 ఉమెన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపారవేత్తలు కావాలనుకునేవారికి, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఎంతో మేలు జరుగుతుంది. 30,000 మంది ఎంటర్‌ప్రెన్యూర్‌ల అనుభవాలు పాఠాలుగా ఉపయోగపడతాయి.
> **- షెఫాలికా,**
> కన్వీనర్, జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటర్‌షిప్

చెత్త ఏరుతూ ఎత్తుకు ఎదుగుతూ

*** స్ఫూర్తి**

మూసారాంబాగ్ సమీపంలోని సలీం నగర్‌లో తెల్లవారుజామున 'చెత్తబండొచ్చిందమ్మా' అని అరుస్తూ కనిపిస్తుంది జయలక్ష్మి. డిగ్రీ చదువుతూ తల్లి నడిపే చెత్తబండిలో సాయం చేస్తుంది జయలక్ష్మి. 'ఎదగాలనుకుంటే చెత్త నుంచి కూడా ఎదగొచ్చు' అంటుందా అమ్మాయి. తాను నివాసం ఉండే మురికివాడ పిల్లల కోసం ట్యూషన్లు చెబుతూ, వాలంటీర్‌గా పని చేస్తూ, ప్రతిష్ఠాత్మక 'గాంధీ - కింగ్ స్కాలర్లీ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్'లో భాగంగా జూన్‌లో అమెరికా వెళ్లి వచ్చింది జయలక్ష్మి. చిన్న చితకా సవాళ్లకే డీలా పడుతున్న యూత్‌కు జయలక్ష్మి ఇచ్చే స్ఫూర్తి చాలానే ఉంది.

యునైటెడ్ స్టేట్స్- ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యు.ఎస్.ఐ.ఇ.ఎఫ్) వారి 'గాంధీ- కింగ్ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్' స్కాలర్‌షిప్ పొంది, అమెరికా వెళ్లి రెండు వారాల పాటు మార్టిన్ లూథర్ కింగ్ మార్గంలో అహింసా పద్ధతితో ప్రజా ఉద్యమాలు ఎలా నిర్వహించాలో అధ్యయం చేసి రావడానికి దరఖాస్తులు కోరినప్పుడు మన దేశవ్యాప్తంగా 4 వేల అప్లికేషన్లు వచ్చాయి. వారిలో కేవలం 10 మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆ పది మందిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉన్నారు. వారిలో ఒకరు అరిపిన జయలక్ష్మి.

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ సమీపంలో అతి పెద్ద మురికివాడ- సింగరేణి కాలనీలో ఉంటూ, చెత్త బండి లాగుతూ చదువుకుంటున్న ఈ అమ్మాయి ఇలా అమెరికా వరకూ చేరుకోవడం సామాన్యం కాదు. పోరాడే తత్వం, సాధించాలనే పట్టుదల ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. జయలక్ష్మిలోని అసాధారణమైన చొరవ, తపన ఆమెను ఇలా ముందుకు నడుపుతున్నాయి.


అమెరికాలో జయలక్ష్మి

ముగ్గుపిండి అమ్మే దళిత కుటుంబం

అరిపిన జయలక్ష్మిది రాయలసీమ ప్రాంతానికి చెందిన దళిత కుటుంబం. తండ్రి రామ్మోహన్, తల్లి హుసేనమ్మ చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని హైదరాబాద్ వలస వచ్చారు. వీరి ఇళ్లల్లో ముగ్గుపిండి అమ్ముకుని తరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే జయలక్ష్మి తల్లిదండ్రులు చెత్తబండి నడపడాన్ని ఉపాధి చేసుకున్నారు. 'అమ్మ ఒక బండి, నాన్న ఒక బండి నడుపుతారు. కాలనీ వాళ్లు నెలకు ఇంతని ఇచ్చే డబ్బులే మాకు జీవనాధారం. గవర్నమెంట్ నుంచి ఏమీ జీతం రాదు. చెత్త తీయడం చాలా కష్టమైన పని. నాన్న తానొక్కడే చెత్త తీయగలిగినా అమ్మకు కష్టమని నేను ఏడో క్లాస్ నుంచి ఇవాళ్టి వరకూ ఆమెకు తోడు వెళుతూనే ఉన్నాను. చెత్త సేకరించడం, తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, డంపింగ్ యార్డ్‌లో పడేయడం అన్నీ చేస్తాను. ఇది చాలా దారుణమైన పని అని కొందరు అంటారు. కాని నా మటుకు నాకు ఇది అన్నం పెట్టే వృత్తి. నేను దానిని గౌరవిస్తాను. మా ఇంట్లో నేను కాకుండా అన్నయ్య, చెల్లెలు ఉన్నారు. అందరూ మంచిగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని మా అమ్మ తపన. అంతవరకు ఈ పని చేయకతప్పదు' అంటుంది జయలక్ష్మి.


బండిలో చెత్త వేస్తున్న జయలక్ష్మి

ఎన్.జి.ఓ దృష్టిలో పడి

జయలక్ష్మి చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉండేది. కాలనీలోని సమస్యలపై మాట్లాడేది. స్కూల్లో ఒకసారి ఇలాగే మాట్లాడితే 'మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్' అనే ఎన్.జి.ఓ దృష్టిలో పడింది. పేదవర్గాల కోసం పని చేసే ఆ సంస్థ జయలక్ష్మిని తన కార్యకలాపాల్లో భాగం చేస్తూ ప్రోత్సహించింది.

'స్లమ్స్‌లో ఉండే పిల్లల వికాసం కోసం నేను పని చేశాను. హైదరాబాద్‌లో 56 స్లమ్స్ ఉంటే వాటిలో 21 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. మేమందరం మహిళా సంక్షేమ శాఖ దగ్గరకు వెళ్లి మాట్లాడి వాటిని సాధించాం' అంటుంది జయలక్ష్మి. ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకుని తన వాడ నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్న జయలక్ష్మి తన వాడలోని పిల్లలకు సాయంత్రాలు ట్యూషన్ చెప్తూ వారి చదువుకు మేలు చేస్తోంది. 'కోవిడ్ సమయంలో మా కాలనీలో నేను కార్యకర్తగా పని చేశాను. కోవిడ్ రాకుండా చాలా వరకు సక్సెస్ అయ్యాను' అంది.

ఐ.ఏ.ఎస్ కావాలని

'యువతకు నాయకత్వ లక్షణాలు ఉండాలి. హక్కుల కోసం పోరాడాలి. అమెరికాలో శాంతియుత పోరాటాల విజయగాథలను అధ్యయనం చేయగలగడం నా అదృష్టం. ఒక యువ ప్రతినిధిగా పోరాడుతూనే ప్రజల సేవ కోసం ఐ.ఏ.ఎస్ సాధించాలనుకుంటున్నాను. అందుకు కావలసిన సహాయం పొందగలననే అనుకుంటున్నాను. నాకు ఎంతమంచి పేరున్నా చెత్త అమ్మాయి అనే పిలుస్తారు కొందరు. వారి చేత ఉత్తమ అమ్మాయి అనిపించుకునేందుకు, లక్ష్యం లేని వారి బుర్రలే చెత్త అని నిరూపించేందుకు మరింత కష్టపడతాను' అంది జయలక్ష్మి.

– సాక్షి ఫీచర్స్ డెస్క్


*** సందర్భం**

పక్షులతో ప్రయాణం

ఛాయాచిత్ర ప్రేమికుడు జి.వి. ప్రసాద్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ


జి.వి. ప్రసాద్

ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానం. పక్షులు, వన్యప్రాణుల ఫొటోలు తీయాలంటే, గంటల కొద్దీ వేచి చూడాలి. వాటి ప్రశాంతతకు భంగం కలగకుండా ఫొటోలు తీయడం కత్తిమీద సాములాంటిదే. పారిశ్రామికవేత్త, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్‌కి మాత్రం అది ఆటవిడుపు. ఆయన దేశ విదేశాల్లో పర్యటించి తీసిన ఫొటోలతో ఇటీవల 'ది బర్డ్స్ అండ్ బిలీఫ్స్' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా... సాక్షితో సంభాషణ.



■ **ఔషధాల తయారీ రంగంలో తీరిక లేకుండా ఉండే మీకు, పక్షుల కోసం పర్యటనలు, ఫొటోగ్రఫీ హాబీ ఎప్పటి నుంచి?**

గత పది, పదిహేనేళ్లుగా ఫొటోగ్రఫీ చేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి, స్వయంగా తీసిన ఫొటోల సమాహారమే ఈ పుస్తకం. కొన్ని ఫొటోలతో పుస్తకాన్ని తీసుకురావాలని, మరికొన్నింటితో ప్రదర్శన ఏర్పాటు చేయాలని నా ఆలోచన. గతంలో రెండు పుస్తకాలు ప్రచురించాను. ఒకటి అలాస్కా మీద, మరొకటి స్పితి వ్యాలీ. ఇది మూడో పుస్తకం.

■ **'బర్డ్స్ అండ్ బిలీఫ్స్' లో మంచి కొటేషన్‌లు కూడా కనిపిస్తున్నాయి!**

నన్ను ప్రభావితం చేసే సూక్తులు కనిపించినప్పుడు, విన్నప్పుడు పుస్తకంలో రాసుకోవడం నాకు పాతికేళ్లుగా అలవాటు. వాటిలో కొన్నింటిని ఇందులో పొందుపరిచాను. ఈ పుస్తకం నా అభిరుచికి, జ్ఞాపకాలకు నిలువుటద్దం.

■ **ఇందులో ఏయే ప్రదేశాల పక్షులున్నాయి?**

మనదేశంలో దక్షిణాదిలో హైదరాబాద్, ఉత్తరాది నుంచి భరత్‌పూర్, కాన్హా నేషనల్ పార్క్. ఆఫ్రికా ఖండంలో కెన్యా, టాంజానియా, బొట్సువానా, నార్త్ ఆర్కిటిక్, అంటార్కిటికా తదితర ప్రాంతాల పక్షుల ఫొటోలున్నాయి. అంటార్కిటికాలో పెంగ్విన్స్ కూడా తీశాను. నార్త్ అమెరికాలో అలాస్కా కూడా కవర్ చేశాను. ఈ ప్రాంతాలలో కనిపించే పక్షులతో పాటు క్షీరదాలు, ప్రకృతి ఫొటోలూ తీశాను. కానీ, ఈ పుస్తకాన్ని మాత్రం పక్షుల కోసమే కేటాయించాను.

■ **వలస పక్షులు భారీగా వచ్చే ఆంధ్రప్రదేశ్, పులికాట్ సరస్సుకు వెళ్లారా?**

వెళ్లాను, ఫ్లెమింగో ఫొటోలు తీశాను. కానీ ఈ పుస్తకంలో ప్రచురించలేదు.



■ **బర్డ్ వాచింగ్ కోసం విభిన్నమైన అనేక ప్రాంతాలను సందర్శించారు. మీకు బాగా నచ్చిన ప్రదేశం, సందర్భం, ఫొటో ఏది?**

అలాస్కాలో ల్యాండ్ స్కేప్‌లు, మంచినీటి సరస్సులు, ఉప్పు నీటి చెరువులు, పొరలు పొరలుగా పేరుకుపోయిన మంచు... మొత్తంగా చూస్తే ప్రకృతి అద్భుతంగా స్ఫూర్తిదాయంగా అనిపిస్తుంటుంది. పెద్ద ఎలుగుబంట్లు, బాల్డ్ ఈగల్స్, సాల్మన్ చేపలతోపాటు రకరకాల చేపలుంటాయి. సముద్రం నుంచి మంచి నీటి సరస్సుల వైపుకు గుంపులుగా వచ్చే చేపల్ని చూడడం వర్ణించలేనటువంటి అనుభూతి. అలాగే మరొకటి... ఆఫ్రికాలో ప్రాణులు వలస వెళ్లడం. వైల్డ్ బీస్ట్ పెద్ద సంఖ్యలో నదిని దాటుతున్న దృశ్యం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతోంది.

■ **ఆర్నిథాలజిస్టు ఆశిష్, కెమెరా మెళకువలు నేర్పిన సురేశ్ చిత్తూరి గురించి మీ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు!**

ఆశిష్‌తో చాలా ఏళ్ల పరిచయం. వాళ్ల పిల్లలు, మా పిల్లలు క్లాస్‌మేట్స్. బర్డ్ వాచింగ్‌ను పరిచయం చేసింది ఆయనే. ఇక శ్రీనివాస హ్యాచరీస్ సురేశ్ చిత్తూరి కూడా నాకు మంచి మార్గదర్శి.

■ **ఎన్నిరకాల పక్షులను ఫొటో తీశారు?**

రెండువందలకు పైగా పక్షి జాతులను ఫొటో తీశాను.

■ **మీ పుస్తకంలో పాలపిట్ట, కాకి, కోకిల కనిపించాయి. కానీ రామచిలుక కనిపించలేదు! అలాగే కొల్లేటి కొంగలు, చిల్కా సరస్సులో విహరించే పక్షులను మేము తర్వాతి పుస్తకంలో చూడవచ్చా?**

రామచిలుకల ఫొటో తీశాను. కానీ, పుస్తకానికి ఫొటోల ఎంపికలో వదలిపెట్టాను. కొల్లేరు వెళ్లలేదు. చిల్కా సరస్సుకు వచ్చే ఏడాది వెళదామనుకుంటున్నాను.

శాస్త్రీయతకు గౌరవం

డాక్టర్ రెడ్డీస్ సంస్థలో 1990 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీవీ ప్రసాద్ ఆ సంస్థ ఎదుగుదల, 66 దేశాలకు విస్తరణలో తనవంతుగా విశేషమైన కృషి చేశారు. సశాస్త్రీయమైన పరిశోధనల పరంపరలో ఆయనను వరించిన కొన్ని ప్రత్యేక గుర్తింపులు... పురస్కారాలివి.

- వైపీఓ గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డు- 2020
- వి. కృష్ణమూర్తి అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ బై ద సెంటర్ ఫర్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్, 2019
- బౌండరీ బ్రేకర్ లీడర్ అవార్డ్, సీఈఓ అవార్డ్స్ 2018
- ఇండియా బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2015
- ఇండియాస్ బెస్ట్ సీఈవో బై బిజినెస్ టుడే, 2014
- ఇండియా టాలెంట్ మేనేజ్‌మెంట్ అవార్డ్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2014

■ **మీ నేపథ్యం మొత్తం హైదరాబాదేనా?**

లేదు, పాక్షిక హైదరాబాదీని. నాల్గవ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాను. తర్వాత నెల్లూరులో 12వ తరగతి వరకు, రెండున్నరేళ్లు చెన్నై అన్నా యూనివర్సిటీ, ఆ తర్వాత చికాగోలో ఇలినాయీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్, మాస్టర్స్ పర్‌డ్యూ (Purdue University) యూనివర్సిటీలో పూర్తి చేసి హైదరాబాద్‌కి వచ్చాను.

■ **పుస్తకం విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని వన్యప్రాణుల సంరక్షణ కోసం విరాళమని ప్రకటించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపట్లేదని అనుకుంటున్నారా?**

ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తోంది. కానీ, ప్రభుత్వం ఒక్కటే అన్నింటినీ పరిష్కరించలేదు. వ్యక్తుల విరాళాలు చాలా ఉపయోగ పడతాయి. పర్యావరణం, వన్యప్రాణుల పరిరక్షణ ముఖ్యమైన అంశం అని నేను మద్దతు ఇస్తున్నాను. ఆన్‌లైన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయిస్తున్నాం. పుస్తక విక్రయాలతో వచ్చే డబ్బు నాకవసరం లేదు. ఉచితంగా ఇస్తే పుస్తకం గౌరవం తగ్గిపోతుంది. అందుకే విక్రయాలను మంచి పనికి విరాళంగా ఇవ్వాలనుకున్నాను.

■ **అంజిరెడ్డి (డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వ్యవస్థాపకులు)గారు చెప్పినట్లుగా మన కుండ నిండిన తర్వాత, అదనంగా వచ్చి పడుతున్న నీటిని మరొకరికి ఉపయోగపడేలా చేయాలి అనే సూత్రాన్ని పాటిస్తున్నారా? ఆయన నుంచి అలాగే మీ నాన్నగారి నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?**

మా నాన్నగారు (గ్రీన్ పార్క్ హోటల్ వ్యవస్థాపకులు) చాలా డీటెయిల్ ఓరియెంటెడ్. మనం చేస్తున్న పని గురించి సూక్ష్మ స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెబుతారు. వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడేవారు. మా మామగారు (అంజిరెడ్డి) విజన్ చాలా విస్తృతమైనది. వారిద్దరినీ ఒకే 'ఫ్రేమ్'లో చెప్పాలంటే... 'అడవి అందులో చెట్లు' అని చెప్పవచ్చు. అంజిరెడ్డి గారి ద్వారా అడవిని చూస్తే, మా నాన్న గారి ద్వారా అందులో వృక్షాలను చూశాను.

■ **పాఠకులకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?**

'ప్రపంచంలోని ప్రతిదీ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. మన ఆరోగ్యం అడవి ఆరోగ్యంతో ముడిపడి ఉంది. మన శ్రేయస్సు కోసం ప్రకృతి పరిరక్షణ తప్పనిసరి' అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరూ 'కొంతవరకైనా ప్రకృతితో మమేకమవుదాం' అనుకుంటే... ప్రకృతి పరిరక్షణ కోసం చేయగలిగిన చిన్న చిన్న పనులు అందరమూ చేయగలుగుతాం.

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి